2. చంపెనిందు ప్రభుని కర్తను - సంపాదించె నర విముక్తుని బెంపారు నానందమసూక్తిని - ననురక్తిని నిత్యముక్తిని మహా ॥సిలువే॥

3. పాపదావాగ్ని సంతప్తులు - స్వపుణ్యదుర్మద వ్యాప్తులు నీ పేరు నమ్మిన దీప్తులు - సుఖ ప్రాప్తులు సర్వ తృప్తులు మహా ॥సిలువే॥

4. రంగొప్ప దీని ప్రసంగము - మంగళగీతసారంగము అంగీకార హృత్పద్మ భృంగము - రక్షశృంగము పాపభంగము మహా ॥సిలువే॥

5. భయములేదని చాటుచున్నది - ప్రియయేసు వేడుకొమ్మన్నది - దయ జూపు నీ కనుచున్నది - నిక్కమైనది చక్కనైనది మహా ॥సిలువే॥

6. చేరవచ్చిన వారి భారము - ఘోరమైనను తద్విచారము ఆరూఢిపరమార్థ సారము - సువిచారము సదాచారము మహా ॥సిలువే॥

7. ఘనమైన రక్షక ధ్యానము మనల ముక్తికి జేర్చువైనము - జనకృపాసుధా పానము దూతగానము తేజోమానము మహా ॥సిలువే॥

8. ఇన్ని దినము లూరకుంటిమి - యిపుడే రక్షణ కనుగొంటిమి - కన్న తండ్రిని గొల్వకుంటిమి - కానకుంటిమి యెరగకుంటిమి మహా ॥సిలువే॥

- రావూరి రంగయ్య

# సర్వ పరిశుద్ధుల స్మరణ

## 597 ఘనమగు పరిశుద్ధులు

రా -కళ్యాణి (చాయ : ఎంతో సుందరమైనవి ) తా -త్రిపుట

ఎంతో ఘనమగువారలు - పరిశుద్ధులు - ఎంతో వినదగువారలు = సంతసంబుగ వార -త్యంత ప్రేరణతోడ - సొంతవారిని సహా - సొంతంబుగ విడచి = చెంతజేరిరి యేసు ప్రభుని - చింతలేకను వెంబడించి - వింత పనులను జేసి బ్రతికిరి - అంతమువరకును నడచిరి ॥ఎంతో॥

1. పేతు రపోస్తలుండు - అతని సోదరు - డతి ప్రియు దంద్రెయయు = నీతి నియమములందు - ప్రీతితో బ్రదుకుచు - చేతి పనులయందు - శ్రద్ధతో నుండుచు = ఖ్యాతి నొందిన యోహాను - అతని యన్న యాకోబుతోను - ప్రతి దినంబును కలిసి యుండుచు - భక్తి ప్రభువును వెంబడించిరి ॥ఎంతో॥



2. ఆస్తి నిచ్చిన బర్నబా - ఆస్తిపరుడ - పోసలులతో జేరెన్ = స్వస్థబుద్ధి తోడ - ఆస్తివాడుట యెట్లో - క్రీస్తు సేవకొరకు - ఖర్చుపెట్టుట యెట్లో = వాస్తవముగ నేర్పినాడు - ఆస్తిగలవారలకు నెల్ల - ప్రస్తుతంపు ఆస్తిపాస్తులు - ప్రభువు పనికియ్యవలెనని ॥ఎంతో॥

3. సంఘమును హింసించిన - సంఘాభిమాని - సంఘ నాయకుడు పౌలు = సంఘముల నెన్నిటినో - చక్కగను స్థాపించి - సంఘముల కుత్తరముల్ - సమయానుకులముగ = సంఘ కాపరులకును సహా - సరియగు సలహాల నిచ్చి- సంఘములను ప్రభువు కొరకై స్థాపించి నిలుపలేదా ॥ఎంతో॥

4. కన్యయైన మరియమ్మ - ధన్యురాలు - కన్యలకు తల్లులకున్ను = అన్యులకు అందరికి - ఆదర్శముగ నుండ - సన్యాసిను లెందరో -స్వామిని సేవించ = కన్యకలుగ నిలుచువారలు - కఠినవ్రతములతోడ నుండి - ధన్యులగు పరిశుద్ధులతో - దైవసన్నిధి నుండ జూపెను ॥ఎంతో॥

5. మగదాలయూరి మరియ - మహినినున్న - మగువలలో కెల్లను = భగవంతుడై నట్టి - ప్రభువు యేసునుజేరి - నగము నెక్కెను తన - సొగసైన మార్పుచే = సాగి మొదట సమాధికడకు - స్వామిదర్శనమొంది మొదట- వేగవెళ్లి శిష్యులకును - వెదకి సాక్ష్యమియ్యలేదా ॥ఎంతో॥

6. మత్తయి మార్కులను వారు - మతమునందు - అతినిష్టగలవారలు = మత్తయి యూదులకై తన పుస్తకమును వ్రాసె - మార్కు గూడను తన సు-వార్తనందరి కిచ్చె = వాస్తవంపు జీవితమును - వరుసగాను గలిగియుండ - క్రీస్తు ప్రభువును వెంబడించగ - క్రొత్తలోకము జూపగలిగిరి ॥ఎంతో॥

7. చూచననేగాని- నమ్మనని - పేచిపెట్టి నతోమయు = చాచి చేయి చూచి చక్కగ నమ్మెను - చూడకుండనె లూక - వైద్యుండు నమ్మెను = యీ చొప్పున వీరలిద్దరు - నీచజనులకెల్లరకు తము - బ్రోచు ప్రభువును జూపుచుందురు - బ్రోదిగా ప్రతిదినమునందును ॥ఎంతో॥

8. ప్రభువా నీ పరిశుద్ధుల - బ్రతుకునందు - మా భాగ్యమునున్నదిహా = ప్రభువా వారి బ్రదుకు - ప్రబలమైన సేవ - విభవంగాగని - విజయంబు గాంచుచు = సభను యే రాణింపజేసి - సఫలముగ సేవించి బ్రతికి - ప్రభువ వారితో నేలునట్లు - యభయమియ్యు మాకు దేవా ॥ఎంతో॥

- బన్యన్ జోసఫ్